క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టుకు చెందిన వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిశారు. 2024 సంవత్సర క్యాలెండర్, డైరీని ఆయనతో ఆవిష్కరింపజేశారు. అనంతరం యూనియన్ నాయకులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిసి క్యాలెండర్లు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రీజినల్ అధ్యక్షుడు నాగేశ్వరావు, కార్యదర్శి నడవడి రమేష్, సంయుక్త కార్యదర్శి నడవడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం.మహేష్, సిబ్బంది విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహించి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌డీ నాహిద్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

పొదలకూరు : ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పొదలకూరు తాలూకా యూనిట్ క్యాలెండర్‌ను మంగళవారం పొదలకూరులో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.పెంచలరావు, ఎన్.వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సోమశిల డీఈ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి ఎన్జీఓల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, ఎస్.చిరంజీవులు, కోశాధికారి కామాక్షమ్మ, సహాధ్యక్షుడు రఘురామయ్య, ఉపాధ్యక్షులు షానవాజ్, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో 39 వినతులు

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరు, పున్నూరు గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకానికి సంబంధించి మంగళవారం జరిగిన గ్రామసభల్లో రీసర్వే సమస్యల పరిష్కారం కోసం 39 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. పున్నూరులో 14 అర్జీలు రాగా, లేబూరులో 25 వినతులు అందాయని తెలిపారు. సమస్యలను త్వరతగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ (సర్వే) రవికుమార్, మండల సర్వేయర్ హరనాథ్, ఆర్ఐ జీవన్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలు

పొదలకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ నగేష్‌కుమారి చేతుల మీదుగా ప్రభుత్వం అందజేస్తున్న విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆల్ ఇన్ వన్‌గా ఉన్న పుస్తకాన్ని చదివి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి

పొదలకూరు : విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని బిరదవోలు సచివాలయంలో మంగళవారం సెక్రటరీ బాలకృష్ణయ్య ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బడుగు వెంకటరమణమ్మ, బడుగు శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట నమోదును వేగవంతం చేయండి

కొడవలూరు: పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోవూరు ఏడీఏ డి.సుజాత వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని వీఏఏలతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఏఏలు పంట నమోదు పూర్తి చేసి వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. యూరియా పంపిణీలో వీఏఏల కృషి ప్రశంసనీయమన్నారు. కోరిన రైతులకు సకాలంలో యూరియా అందించి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేయడాన్ని ఆమె అభినందించారు. ఏఎస్ఓ ఎం.రమా గాయత్రి మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలను సకాలంలో పూర్తి చేయాల్సి ఉన్నందున ఇప్పట్నుంచే సర్వే నంబర్ల నమోదు, విస్తీర్ణం లాంటి వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

వరిణిలో సంతకాల సేకరణ

విడవలూరు: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా విడవలూరు మండలంలోని అన్ని పంచాయతీల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వరిణి గ్రామంలో సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు

- మేయర్ స్రవంతి
- ఘనంగా సామాజిక సమతా సంకల్పం


మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): ప్రతి భారతీయుడి గుండెల్లో అంబేడ్కర్ చెరగని ముద్ర వేశారని, ఆయన చిరస్మరణీయుడని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న ఆవిష్కరించనున్న నేపథ్యంలో అంబేడ్కర్ స్ఫూర్తిని చాటేలా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. తనకు మేయర్‌గా అవకాశాన్ని సీఎం కల్పించారని తెలిపారు.

గొప్ప దార్శనికుడు అంబేడ్కర్

దేశం గర్వించదగ్గ గొప్ప మేధావి అంబేడ్కర్ అని, ఆయన్ను స్మరిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన చర్చా వేదికలో పలువురు వక్తలు తమ సందేశాలను వినిపించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడంపై సీఎంకు పలువురు కృతజ్ఞతలను తెలియజేశారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు, నాటికలు

అంబేడ్కర్ జీవిత చరిత్ర.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి.. దృఢమైన రాజ్యాంగాన్ని అందించడంలో ఆయన ముందుచూపు.. తదితర అంశాలపై విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, నాటికలు సభికులను ఎంతో అలరించాయి. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్ప


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు


విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఆవిష్కరణ సందర్భంగా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై జిల్లా అధికారులు, విద్యావేత్తలు, ప్రముఖులు, వక్తలు తమ సంతకాలు చేశారు. అనంతరం వక్తలను సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలను చేపట్టిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, అడిషనల్ కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డీఈఓ గంగాభవాని, ఐటీడీఏ పీఓ మందా రాణి, టీపీఆర్వో ప్రసాద్, వక్తలు ప్రొఫెసర్ సునీత, లతీఫ్‌కుట్టి, డాక్టర్ కిరణ్‌కుమార్, స్వర్ణా వెంకయ్య, పులి చెంచయ్య, జీఆర్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు


మాట్లాడుతున్న ప్రసాద్

నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరు రూరల్ నియోజకవర్గ సీటును జనసేనకు కేటాయించనున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆందోళనతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ప్రసాద్ విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తొమ్మిదేళ్లలో కోటంరెడ్డి చేసిన అభివృద్ధి.. పది నెలల్లో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఎంతో తెలుసుకోవాలని సూచించారు. కోటంరెడ్డి కారణంగా నియోజకవర్గంలోని వ్యాపారులు, రియల్టర్లు, రైస్‌మిల్లర్లు భయభ్రాంతులతో జీవించారని చెప్పారు. నియోజకవర్గ రాజకీయాల్లో విష సంస్కృతిని ఆదాల పెకిలించేశారని చెప్పారు. కోటంరెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి కోట్లు దండుకొని, ఎమ్మెల్యే నిర్వచనానికే మచ్చతెచ్చేలా ప్రొటోకాల్‌కు భంగం కలిగించారని ఆరోపించారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. తమ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై మాట్లాడే అర్హత కోటంరెడ్డికి లేదని చెప్పారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్, ముడియాల రామిరెడ్డి, పాశం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా విజయలక్ష్మి



నెల్లూరు(బారకాసు): బీజేపీ జిల్లా కార్యదర్శిగా పొట్లూరి విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు మినీబైపాస్ రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా మంగళవారం ఆమె కలిశారు. కార్యాలయ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఓటర్ల లిస్ట్ డ్రాఫ్ట్ రోల్, రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల విభాగాధికారులు దేవీకుమారి, శ్రీనివాసులు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ చైతన్యం


ఫాతిమా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): విద్యతోనే సమాజ చైతన్యం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా 193 జయంతిని నగరంలోని ఆవాజ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శేషయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, కార్యదర్శి హర్ష, ఆవాజ్ నేత రియాజ్, కోశాధికారి చాంద్‌బాషా, జిల్లా కమిటీ సభ్యులు ఫయాజ్, రవూఫ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై విచారణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆరోపణలను ఎదుర్కొంటున్న విద్యుత్ ఉద్యోగిపై అధికారులు విచారణను మంగళవారం చేపట్టారు. వివరాలు.. ఈస్ట్ – 1 సెక్షన్లోని వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులొచ్చాయి. దీంతో నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి ఆదేశాలతో నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, ఈస్ట్ – 1 సెక్షన్ ఏఈ విజయ్‌కుమార్ సమగ్ర విచారణ జరిపారు. పూర్తి నివేదికను ఈఈకి అందజేయనున్నామని శ్రీధర్ తెలిపారు.

స్వచ్ఛంద సేవకుల ఎంపికలకు ఇంటర్వ్యూలు

నెల్లూరు(బారకాసు) : నెహ్రూ యువ కేంద్రం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో 2024 – 26 సంవత్సరాలకు జాతీయ యువజన స్వచ్ఛంద సేవకులను ఎంపిక చేయనున్నామని జిల్లా యువజనాధికారి మహేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో బుధ, గురువారాల్లో ఎంపికలను నిర్వహించనున్నామని వివరించారు. గతేడాది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న యువత ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 99635 33440 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోండి



మనుబోలు: ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు మొహసీనా సుల్తానా సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10 తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల్లో హైరిస్క్‌తో ఉన్న గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు సంకోచించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలు గర్భం దాల్చింది మొదలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజయ్య, పీహెచ్ఎన్ జయశీల, సూపర్‌వైజర్లు వెంకటరమణయ్య, హైమావతి, ఫార్మసిస్ట్ పద్మజ, సిబ్బంది రాజన్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నామని ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయడంతో పాటు సూచనలు, సలహాలివ్వాలని కోరారు.

ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు అనుమతివ్వరూ..



నెల్లూరు(బృందావనం): అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాములవారి మూర్తి ప్రతిష్ఠను భక్తులు వీక్షించేందుకు వీలుగా ఉదయగిరిలోని రంగనాయకులస్వామి ఆలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు అనుమతివ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంశీధర్‌రెడ్డి, యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు.

పుస్తకావిష్కరణ నేడు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో నైతిక పదాలు (నానీలు) పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించనున్నామని పెన్నా రచయితల సంఘ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, కవి తిప్పావఝుల నరసింహమూర్తి రచించిన నైతిక పదాలు పుస్తకాన్ని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఆవిష్కరించనున్నారని చెప్పారు.

అర్చకులకు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని పలు ఆలయాల అర్చకులను మంగళవారం సత్కరించారు. గోపీ, వెంకటరమణ, సత్యనారాయణ, రమేష్‌ను దివ్యాంగుల ఐక్య సంఘ ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

నెల్లూరు(క్రైమ్): గంగమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగుడు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పడారుపల్లిలో గ్రామదేవత గంగమ్మ ఆలయం ఉంది. సోమవారం రాత్రి పూజల అనంతరం అర్చకుడు ఆలయానికి తాళాలేసి ఇంటికెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు ఆలయంలోకి వెళ్లి గర్భగుడి గేట్ తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. ఈ క్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు శ్రీహరి సోదరుడి కుమారుడు వినయ్ ఆలయ ఆవరణలో పార్క్ చేసి ఉన్న కారును తీసుకెళ్లేందుకు వెళ్లారు. విషయాన్ని గమనించిన దుండగుడు అప్రమత్తమై అమ్మవారి మెడలోని బంగారు మంగళసూత్రాన్ని లాక్కున్నాడు. వినయ్ పట్టుకునేలోపే దుండగుడు పరారయ్యాడు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు శ్రీహరి ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ నారాయణ దేవస్థానానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ధర్మకర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



నెల్లూరు(బృందావనం): చిన్నబజార్‌లోని నెల్లూరు పెద్ద దర్గా ఖ్వాజా పీర్ గంధ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. షెహన్ షా మసీదు ప్రాంగణంలోని దర్గా నుంచి ఫకీర్ల జరబులు, మంగళవాయిద్యాలతో చిన్నబజార్, ములుమూడి బస్టాండ్, సంతపేట తదితర ప్రాంతాల మీదుగా గంధ మహోత్సవం సాగింది. మతపెద్దలు, పీఠాధిపతులు బాబా సాహెబ్ బంధనవాజ్, యాసుఫ్ హుస్సేనీ, సాహెబ్ రాఫత్‌రాజ్ హుస్సేనీ ఆధ్వర్యంలో సమాధులకు గంధ లేపనం చేశారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానాన్ని మధ్యాహ్నం నిర్వహించారు. ఇమామ్ మొహమ్మద్ ఇస్తియాఖ్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన జికిర్ ఇలాహీతో గంధ మహోత్సవం ముగిసింది.

న్యాయవాదుల నిరసన



నెల్లూరు (లీగల్): ఏపీ భూ హక్కు చట్టం – 2023ను రద్దు చేయాలని కోరుతూ నెల్లూరు బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలో నిరసనను న్యాయవాదులు మంగళవారం చేపట్టారు. మాజీ ఏపీపీ భానురామన్, అన్వర్‌బాషా, చుక్కా రమేష్, శంకరయ్య, బందా శ్రీనివాసులు, సంజయ్, అజయ్‌కుమార్, హరనాథ్, గురజాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

ఎంపీని కలిసిన మేయర్



నెల్లూరు(బారకాసు): ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి శాలువా కప్పి మొక్కను అందజేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని నక్కలోళ్ల సెంటర్ వద్ద చెన్నై వైపు వెళ్లే పట్టాలపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. ఎరుపు, తెలుపు, బ్లూ రంగు గళ్ల ఫుల్ హ్యాండ్స్ చొక్కా.. బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నారు. కుడిచేతిపై అమ్మ, ఛాతిపై బంగారమ్మ, బంగారి, బన్ని అనే పచ్చబొట్లున్నాయి. నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మైపాడు రోడ్డును వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను మార్చనున్న తరుణంలో పలు ప్రాంతాల్లో సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిసాన్‌నగర్, మూడో మైలు, వేణుగోపాల్‌నగర్, ప్రశాంతినగర్, సాదావారి పాళెం, డీఎస్ నగర్ తదితర ప్రాంతా ల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని చెప్పారు.